క్లుప్తంగా

ఫీవర్ కేసులపై కలెక్టర్ ఆరా

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సీజనల్ ప్రభావంతో విజృంభిస్తున్న ఫీవర్ కేసులపై కలెక్టర్ సుమిత్‌కుమార్ విచారణకు ఆదేశించారు. ఈనెల 19వ తేదీన సాక్షి దినపత్రికలో సార్ ఫీవర్ పేరు తో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే సీజనల్ కేసుల గురించి విచారించారు. దీంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు జోరుగా ఫీవర్, డెంగీ, మలేరియా కేసులపై ఆరా తీస్తున్నారు. ఇందులో భాగంగానే మంగళవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారని తెలిసింది.

కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేత

చిత్తూరు అర్బన్: కార్పొరేషన్‌లో ఇద్దరిని కారుణ్య నియామాల కింద ఉద్యోగాల్లో నియమిస్తూ మేయర్ అముద మంగళవారం ఉత్తర్వులు అందజేశారు. పారిశుద్ధ్య విభాగంలో కార్మికులుగా పనిచేస్తూ మృతి చెందిన అప్పాదొరై, షణ్ముగం కుటుంబ సభ్యులు కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు పెట్టుకున్నారు. వాటిని పరిశీలించిన కమిషనర్ అరుణ.. అప్పాదొరై కుమారుడు ఉదయ్ కుమార్, షణ్ముగం కుమారుడు జీవాకు ఉద్యోగ నియామకాలు సిద్ధం చేయగా, ఆ ఉత్తర్వులను మేయర్ అందజేశారు.

ఘనంగా గంధోత్సవం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని స్థానిక ఓబనపల్లి కాలనీలో వెలసిన ఖుద్రతి చమన్ ట్రస్ట్‌లో హజరత్ ఇమామే హసేన్, హజరత్ ఇమామే హుస్సేన్ గంధోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ గంధోత్సవం సందర్భంగా కార్యనిర్వాహకులు హజరత్ పీర్ సయ్యద్ అలీషా ఖాదరి బాబా ప్రత్యేకమైన పూజా కార్యక్రమాలు నిర్వహించి, పీర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. గంధం ఊరేగింపు మేళతాళాలతో జరిగింది. కార్యక్రమంలో చిత్తూరు నగర మేయర్ అముద, బుల్లెట్ సురేష్, అప్పు భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో పరిధిలోని 132 కేవీ కొత్తపల్లె సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఎస్‌ఈ సురేంద్రనాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాలసముద్రం, జీడీనెల్లూరు, ఎస్‌ఆర్‌పురం, వెదురుకుప్పం ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 వరకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు మార్పును గమనించాల్సిందిగా కోరారు.

మూడో సెమిస్టర్‌లో విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులు

చిత్తూరు కలెక్టరేట్ : ఎస్వీ యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ మూడవ సెమిస్టర్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని విజ్ఞానదీప్తి కరస్పాండెంట్ ప్రసన్నలక్ష్మి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తమ కళాశాలలో రెండో సంవత్సరం బీఎస్సీ(ఎంఎస్‌సీఎస్) చదువుతున్న మీనా, మీనాక్షి 9.61, రమ్య 9.51, ద్వితీయ సంవత్సరం బీకాం(సీఏ)లో భావన 9.48, నితీష 9.23, యామిని 9.23, శృతి 9.17 పాయింట్లు సాధించారన్నారు. అనంతరం ఆ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఆ కళాశాల వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి, రామాంజులు, డైరెక్టర్లు ప్రకాష్‌చంద్రారెడ్డి, నరేష్‌చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లార్వా దశలోనే దోమలను నివారించాలి



అరగొండలో మురుగునీటి కాల్వలను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

తవణంపల్లె: దోమలు వ్యాప్తి చెందకుండా లార్వా దశలోనే నిర్మూలించాలని జిల్లా మలేరియా సబ్‌యూనిట్ అధికారి పీరూసాహెబ్ సూచించారు. మండలంలోని అరగొండ పంచాయతీలో డ్రైనేజీ కాలువలను పరిశీలించారు. మురుగునీటి కాలువల్లో దోమలను వ్యాప్తి చెందకుండా నిర్మూలించడానికి మందులు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ చిన్నది అయినా కాటు వేస్తే రోగం పెద్దది అవుతుందని వివరించారు. దోమ కాటుకు గురికాకుండా దోమతెరలు వాడాలని, వేపాకు పొగ వేసుకోవాలని వివరించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి దోమల నివారణకు ప్రజలు సహకరించాలని సూచించారు. అనంతరం పాఠశాల విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమకాటు వల్ల వచ్చే వ్యాధుల గురించి వివరించారు. వైద్యాధికారులు ప్రియాంక, మోహన్‌వేలు, హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యంరెడ్డి, రోజా, ఎంఎల్‌హెచ్‌పీ మానస, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలూ.. మీ గళం విప్పండి..

- తాగు, సాగునీరు అందించండి
- ప్రాజెక్టుల నిర్మాణం సాకారం అయ్యేనా ?
- యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తారా ?
- ఎన్నికల హామీలను నెరవేర్చాలని ప్రజలు డిమాండ్





తుంబ ప్రాజెక్టు



అధ్వానంగా యాదమరి రోడ్డు

కాణిపాకం: నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత అసెంబ్లీ సమావేశాలు ప్రారంభయ్యాయి. పాలకులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఎన్నికల ప్రచారం సందర్భంగా కూటమి నేతలు సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని వాగ్దానాలు చేశారు. అలాగే తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, పరిశ్రమలు, ఫ్యాక్టరీలు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. అయితే అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ప్రజాప్రతినిధులు ఇక్కడి పరిస్థితులపై గళం విప్పాలని ప్రజలు కోరుతున్నారు.

చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల పరిధిలో సుమారు 1.55 కుటుంబాలున్నాయి. ఇక్కడి ప్రజలు అధికంగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తారు. ఈ నియోజకవర్గాల్లో ప్రధానంగా తాగు, సాగునీటి సమస్య పట్టిపీడిస్తోంది. వ్యవసాయ భూములకు నీరు అందక పంటలు సాగు చేసే రైతుల సంఖ్య గణనీయంగా తగ్గుతూ వస్తోంది. ఉన్నత చదువులు చదువుకున్న విద్యార్థులు ఉద్యోగాల కోసం వలస బాట పడుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చిత్తూరు నియోజకవర్గంలో ఇలా..

చిత్తూరు జిల్లా కేంద్రానికి ప్రధానంగా జిల్లా ఆస్పత్రిలో మార్పులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, పరిశ్రమలు, ఫ్యాక్టరీలు తీసుకొస్తామని ప్రజాప్రతినిధులు ఎన్నికల సమయంలో మాట ఇచ్చారు. అలాగే కేంద్రీయ విశ్వవిద్యాలయ, యూనివర్సిటీ తెస్తామని హామీ ఇచ్చారు. చిత్తూరుకు తాగునీటి వసతిని కల్పించడంతో పాటు సకల సదుపాయాలు కల్పిస్తామని, హైరోడ్డు విస్తరణ చేస్తామని జోరుగా ప్రచారం చేశారు.

పూతలపట్టులో ప్రధాన సమస్యలు ఇలా..

2014లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం బంగారుపాళ్యం మండలం కీరమంద సమీపంలో మినీ ప్రాజెక్టు కడుతామని హామీ ఇచ్చారు. అప్పట్లో సర్వే కూడా చేసింది. కానీ అమలుకు నోచుకోలేదు. ఈ ప్రాజెక్టు కడితే 20 పంచాయతీలకు నీటి కష్టాలు తీరుతాయి. తుంబ ప్రాజెక్టు అధ్వాన దుస్థితికి చేరుకుంటోంది. దీంతో గేట్లు కూడా దెబ్బతిన్నాయి. పూర్తిస్థాయిలో మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉంది. అలాగే కట్ట మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మెరుగైన రోడ్లు కల్పించండి



రోడ్లు వేయండి. గత ప్రభుత్వంలో రోడ్డు పనులు జరుగుతున్నప్పుడు । రోడ్లు లేని రాష్ట్రమని హేళన చేశారు. ఇప్పుడు ఈ పాలకులు అసలు రోడ్ల విషయాన్నే మరిచిపోయారు. ఈ వర్షాలకు ప్రజలు గుంతలు పడిన రోడ్లపైన ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, సమస్యలు పరిష్కరించాలి. చామంతిపురం ప్రాజెక్టును తీసుకోరావాలి.

– యతీష్, పూతలపట్టు

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలి



చిత్తూరు నగరంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలి. గత ప్రభుత్వ హయాంలో చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ఆదేశాలు కూడా జారీ చేసింది. ఇక్కడ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే పంటలకు మంచి గిట్టుబాటు ధర రావడమే కాకుండా, కార్మికులకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయి.

– నీలకేశ్వర్‌రెడ్డి, చిత్తూరు

కార్మికులను ఆదుకోవాలి



చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి. ఫ్యాక్టరీ మూతపడడంతో కార్మికులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ నిధులను విడుదల చేసి ఆదుకోవాలి. అలాగే కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

– భాస్కర్, చిత్తూరు

ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



జిల్లాలో విస్తృతంగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. తద్వారా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలి. జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ మెడికల్, ఇంజినీరింగ్ కళాశాలలు లేకపోవడం వల్ల చిత్తూరు విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది.

– సద్దామ్, స్టూడెంట్ జేఏసీ చైర్మన్, చిత్తూరు

పంటలకు సాగునీరు ఇవ్వాలి..



మండలంలో నిరుపయోగంగా, అర్ధాంతంగా ఆగిపోయిన హంద్రీ నీవా కాలువ పనులను పూర్తి చేసి పంటల సాగుకు సాగునీరు అందించాలి. బిందు, తుంపర సేద్యానికి అవసరమైన పరికరాలను వెంటనే అందజేయాలి. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఇస్తామన్న రూ.20 వేలు ప్రభుత్వం విధివిధానాలను ప్రకటించి వెంటనే వారి ఖాతాల్లో నగదు జమ చేయాలి.

– కోదండ రెడ్డి, సీవీ పల్లె, ఐరాల

పరిశ్రమల ఏర్పాటు చేయాలి



జిల్లా పునర్ విభజనతో ఉమ్మడి జిల్లాలోని అధిక పరిశ్రమలు తిరుపతికి వెళ్లాయి. చిత్తూరు జిల్లా కేంద్రంతో పాటు ఇతర మండలాల్లో కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేయాలి. తద్వారా చాలావరకు నిరుద్యోగ సమస్యను పరిష్కరించవచ్చు.

– మోహన, గృహిణి, చిత్తూరు

రైతులకు భరోసా కల్పించాలి..



రైతులకు సకాలంలో ప్రభుత్వం రాయితీలు కల్పించి భరోసా కల్పించాలి. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి రైతన్నలకు అండగా ప్రభుత్వం ఉండాలి. ప్రాజెక్టు పనులను పూర్తి చేసి తాగు, సాగు నీటి కష్టాలను తీర్చాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి. ప్రజాప్రతినిధులు నియోజకవర్గ అభివృద్ధిపై అసెంబ్లీలో గొంతు విప్పాలి.

– దాము రైతు బంగారుపాళెం

కూలీలకు ఉపాధి పనులు కల్పించాలి

- డ్వామా పీడీ రాజశేఖర్



ఈచనేరిలో నర్సరీని పరిశీలిస్తున్న డ్వామా పీడీ రాజశేఖర్

తవణంపల్లె: మండలంలోని ప్రతి గ్రామంలో కూలీలకు ఉపాధి పనులను విరివిగా కల్పించాలని డ్వామా పీడీ రాజశేఖర్ ఉపాధి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని కారకాంపల్లెలో చెరువు కాలువ పూడికతీత పనులను పరిశీలించారు. అనంతరం అక్కడే పని చేస్తున్న కూలీలతో మాట్లాడుతూ రోజువారి వేతనం ఎంత ఇస్తున్నారు ? సకాలంలో అందుతోందా ? లేదా? అని ఆరాతీశారు. అనంతరం ఈచనేరిలో నిర్వహిస్తున్న నర్సరీ పరిశీలించారు. నర్సరీలో మొక్కలు బాగా పెంచడంతో రైతు చంద్రబాబును అభినందించారు. మండలంలో అమృత్ సరోవర్, మినీ అమృత్ సరోవర్ పనులు చేయించాలని అధికారులకు సూచించారు. చిన్న, సన్నకారు రైతులకు పండ్ల తోటల పెంపకం, పూల సాగులో పనులు గుర్తించి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. డ్వామా పీడీతో పాటు ఏపీడీ సుబ్రమణ్యం, ఏపీఓ లలిత, టీఏ వెంకటరమణ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



కాషాయాల తయారీని రైతులకు చూపిస్తున్న దృశ్యం

గుడిపాల: వేరుశనగ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి మాధవి అన్నారు. మంగళవారం పేయనపల్లె గ్రామంలో రైతులకు వేరుశనగ పంటపై పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొలం పరిసరాల్లో విశ్లేషణ, శత్రు, మిత్ర పురుగులపై అవగాహన, వాటి జీవితచక్రంతో పాటు పంటను ఏ విధంగా కాపాడుకోవాలనేది వాటిపై వివరించారు. పురుగు మందులు వాడకుండా వేప గింజల కషాయాన్ని వాడాలన్నారు. వేరుశనగ పంటలో అంతరపంటగా ఆముదం, కంచె పంటగా జొన్నసాగు చేస్తే చీడపీడలు నివారించవచ్చన్నారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించడానికి ఉపయోగపడే పొలంబడి కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వేరుశనగలో చీడపీడలని వృక్ష సంబంధిత కాషాయాల తయారీ విధానాన్ని చేసి చూపించారు.

కుక్క దాడిలో విద్యార్థికి గాయాలు



గాయపడిన లోహిత్

ఐరాల: మండలంలోని యదర్లపల్లెకు చెందిన ఒకటో తరగతి విద్యార్థి లోహిత్ మంగళవారం ఇంటి దగ్గర ఆడుకంటూ ఉండగా కుక్క ఒక్కసారిగా దాడి చేసింది. విద్యార్థి చేతులతో పాటు పలుచోట్ల గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించి విద్యార్థికి రేబిస్ ఇంజెక్షన్ వేయించారు. ప్రస్తుతం మండలవ్యాప్తంగా కుక్కలు వీధుల వెంట దాడులు చేస్తూ తీవ్రంగా గాయపరుస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లో కుక్కలను నిర్మూలించాలని కోరుతున్నారు.

దాతృత్వంతో స్కూళ్లను అభివృద్ధి చేయండి



విద్యార్థికి నగదు బహుమతిని అందజేస్తున్న లక్ష్మణరెడ్డి, డీఈఓ దేవరాజు

పూతలపట్టు: అసమానతలు అధికంగా ఉన్న మన సమాజంలో ధనవంతుల్లో దాతృత్వం పెరగాలని, ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కీ.శే.రవికుమార్ రెడ్డి మెమోరియల్ కమిటీ ఆధ్వర్యంలో పదోతరగతి మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతుల ప్రదానం చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా లక్ష్మణరెడ్డి, డీఈఓ దేవరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు ఎస్.తేజశ్రీ, ఎస్.అమృత హర్షిణి, టి.లాహిరి, పి.దేవిప్రసాద్, అస్మిత, పి.ధనుశ్రీ, ఎస్.సాయి, విష్ణువర్ధన్, కె.మోహిని, యస్.ఇంతియాజ్, టి.హిమశ్రీకి డీఈఓ దేవరాజ్ చేతుల మీదుగా కీ.శే.పూతలపట్టు రవికుమార్ రెడ్డి మెమోరియల్ కమిటీ అందించిన రూ.20 వేల నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో డీవైఈఓ చంద్రశేఖర్, ఎంఈఓలు వాసుదేవ్, మధు, దామోదర నాయుడు, గ్రామ సర్పంచ్ మస్తామణి, ఉప సర్పంచ్ బాబురెడ్డి, ఉపాధ్యాయ ఉద్యమ నేత ఆనంద నాయుడు, విద్యా కమిటీ చైర్మన్ రామ్మూర్తి రెడ్డి, టీచర్లు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని సురేందర్ రెడ్డి, మోహన్ రెడ్డి పర్యవేక్షించారు.

గ్రామీణ ప్రజలకు వరం..ఫ్యామిలీ డాక్టర్





తవణంపల్లె: రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు, ఐరాలలో..

తవణంపల్లె/ఐరాల: గ్రామీణ ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం వరమని వైద్యాధికారి మోహన్‌వేలు, పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. వారు ఆయా మండలాల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అదేవిధంగా గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వాధిగ్రస్తులకు మందులు అందజేశారు.

గుడిపాలలో ..

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని డాక్టర్ అనూష అన్నారు. మండలంలోని కుప్పిగానిపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు డ్రైవర్ల మధ్య గొడవ..

బంగారుపాళెం: బస్సును ఓవర్‌టేక్ క్రమంలో ఇద్దరు డ్రైవర్ల మధ్య జరిగిన గొడవలో ఓ డ్రైవర్ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని టోల్‌ప్లాజా వద్ద చోటు చేసుకుంది. వివరాలు.. మండలంలోని మహాసముద్రం టోల్‌ప్లాజా సమీపంలో మంగళవారం వేకువజామున చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్‌డ్రైవర్ మృతి చెందాడు. బెంగళూరు నుంచి విజయవాడకు వెళ్తున్న ప్రైవేట్ బస్‌డ్రైవర్ గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన సుధాకర్‌ను టోల్‌ప్లాజా సమీపంలో వెనుక నుంచి వస్తున్న మరో ప్రైవేట్ బస్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సుధాకర్ తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఇది ఇలా ఉండగా.. ముందు వెళ్తున్న బస్సును వెనుక వస్తున్న మరో బస్సు ఓవర్ టేక్ చేసే క్రమంలో బస్ అద్దం విరిగింది. దీంతో డ్రైవర్ల మధ్య గొడవ జరిగినట్లు సమాచారం. వెనుక వస్తున్న బస్ డ్రైవర్ సమాధానం చెప్పకుండా బస్ స్టార్ట్ చేసుకుని వెళ్లేందుకు ప్రయత్నించడంతో సుధాకర్ బస్ ముందుకు వెళ్లి నిలువరించే ప్రయత్నం చేయగా వేగంగా ఢీకొని సుమారు 900 అడుగుల(టోల్‌ప్లాజా సమీపం నుంచి యాదమరి మండలం అమరరాజా ఫ్యాక్టరీ) వరకు లాక్కుని వెళ్లాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుధాకర్ మృతి చెందాడు. మృతదేహం యాదమరి పోలీస్‌స్టేషన్ లిమిట్స్‌లో ఉండడంతో సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.